
ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి



5

జయశంకర్
భూపాలపల్లి
ములుగు

గురువారం 6 జూన్ 2024



అరునెలల్లో ఓటరు నాడి మారింది. అందుకు ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ప్రజలు పార్టీల వైపు చూసిన తీరు నిదర్శనంగా కనిపిస్తోంది. హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల సమరంలో ఓటర్లు కాంగ్రెస్‌కే పట్టం కట్టినా.. చాలా చోట్ల ఆ పార్టీ ఓటు బ్యాంకు చేజారటంతో కేడర్‌లో ఆందోళన కనిపిస్తోంది. ఓ వైపు మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీకి ఆధిక్యం రావడం.. మరో వైపు బీజేపీ అభ్యర్థి సొంత నియోజకవర్గంలో హస్తం పార్టీ ఆధిక్యం సాధించడం లాంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా పుంజుకుంది. పట్టణ ఓటర్లు బీజేపీ వైపే మొగ్గు చూపగా.. గ్రామీణ ఓటర్లు మాత్రం కాంగ్రెస్‌కు జై కొట్టారు. అలాగే మూడు పర్యాయాలు వరుసగా గెలిచి వరంగల్‌ను కంచుకోటగా మార్చుకున్న బీఆర్‌ఎస్ ఈసారి తీవ్ర నష్టాన్ని మూటగట్టుకుంది. పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండోస్థానంలో నిలవగా, మిగిలిన ఐదు చోట్ల మూడో స్థానానికి దిగజారింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



నాటికీ.. నేటికీ..



‘లోక్‌సభ’ పరీక్షలో మంత్రులు ఫెయిల్!


- ఇన్‌చార్జ్‌లుగా పొరుగుజిల్లాల్లో ఓరుగల్లు నేతల బాధ్యతలు
- మెదక్‌లో కొండా సురేఖ, ఆదిలాబాద్‌లో సీతక్క, కరీంనగర్‌కు పొన్నం, పెద్దపల్లిలో దుద్దిళ్ల..
- శ్రీధర్‌బాబు మినహా ముగ్గురు మంత్రుల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటమి

వివరాలు : 7లో..

ఆరునెలల్లో మారిన ఓటరు నాడి

- వరంగల్ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్‌కు తగ్గిన ఓటు బ్యాంకు
- అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభకు 80వేల పైచిలుకు ఓట్ల వ్యత్యాసం
- వరంగల్ తూర్పులో మంత్రి కొండాకు షాక్.. బీజేపీకి జై కొట్టిన జనం
- కమలం వైపు చూసిన అర్బన్ ఓటర్లు
- బీజేపీ అభ్యర్థి అరూరి సొంత సెగ్మెంట్‌లో హస్తానికి ఆధిక్యం
- కంచుకోటలో మూడోస్థానానికి పరిమితమైన ‘గులాబీ’ పార్టీ
- పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ మినహా ఐదు నియోజకవర్గాల్లో మూడోస్థానం
- వరంగల్ అర్బన్‌లో మరీ దారుణం.. 20వేల ఓట్లకే పరిమితం

7





6

మానుకోటలో కాంగ్రెస్ జోష్

- లోక్‌సభ ఎన్నికల్లో పదేళ్ల తర్వాత విజయం
- ఇక స్థానిక ఎన్నికలకు సై అంటున్న కేడర్

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో.. ఎన్నికలు	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్‌ఎస్
2023 అసెంబ్లీ	6,63,556	1,56,638	5,03,298
లోక్‌సభ	5,81,294	3,60,955	2,32,033

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో.. ఎన్నికలు	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్‌ఎస్
2023 అసెంబ్లీ	6,85,897	34,431	4,43,910
లోక్‌సభ	6,12,774	1,10,444	2,63,609



అధికారులు, అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్లను కట్టలు కడుతున్న సిబ్బంది

‘పట్టభద్రుల’ ఫలితంపై ఉత్కంఠ

- ప్రారంభమైన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు
- నల్లగొండ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ప్రక్రియ
- మొత్తం 96టేబుళ్ల ఏర్పాటు.. ఒక్కో టేబుల్‌లో వెయ్యి ఓట్ల లెక్కింపు
- ప్రతీ రౌండ్‌లో 96వేల ఓట్ల కౌంటింగ్



కౌంటింగ్ కేంద్రం వద్ద తీన్మార్ మల్లన్న, రాకేష్ రెడ్డి కరచాలనం

నల్లగొండ, జూన్ 5: పార్లమెంట్ ఫలితాలు రావడంతో.. ఇక అందరి దృష్టి వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితంపై పడింది. ఈ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో భాగంగా గత నెల 27న బ్యాలెట్ పద్ధతిన పోలింగ్ జరగ్గా.. పట్టభద్రులు ఏ పార్టీ అభ్యర్థికి పట్టం కట్టబోతున్నారా అన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. మొత్తం 52మంది అభ్యర్థులు పోటీ చేయగా.. 4.63లక్షల ఓట్లకు గాను 3.36లక్షలకు పైగా ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియ బుధవారం నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని అనిశెట్టిదుప్పలపల్లి గోదాముల్లో ప్రారంభమైంది. ఉదయం 8గంటలకు నల్లగొండ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన పర్యవేక్షణలో లెక్కింపును ప్రారంభించిన అధికారులు, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం 4గంటల వరకు 25బ్యాలెట్ల చొప్పున బండిల్స్‌ను కట్టారు. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. మొత్తం 96టేబుళ్లను ఏర్పాటు చేసి.. ఒక్కో టేబుల్‌పై 1000ఓట్ల లెక్కన, ప్రతీ రౌండ్‌లోను 96వేల ఓట్లను కౌంట్ చేయనున్నారు. అయితే నాలుగు రౌండ్లలో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తవనుంది. అర్ధరాత్రి దాటిన తరువాతే తొలి ప్రాధాన్యత ఓట్లపై స్పష్టత రానుంది. ఒకవేళ తొలి ప్రాధాన్యత ఓట్లద్వారా ఫలితం తేలకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లు, అప్పటికీ ఫలితంపై స్పష్టత రాకపోతే మూడో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఇక విజేత ఎవరనేది తేలడానికి రెండు రోజుల సమయం పట్టనుంది. ఎస్పీ చందన దీప్తి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలీస్‌శాఖలోని అన్ని ర్యాంకులకు చెందిన 800మంది సిబ్బందితో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాళ్ల వద్ద డీఎస్పీ ర్యాంకు అధికారులు బందోబస్తును పరిశీలిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డితో పాటు ఇతర అభ్యర్థులు, వారి ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాల్లోనే ఉండి సరళిని తెలుసుకుంటున్నారు.



కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నల్లగొండ కలెక్టర్

ఘనంగా పర్యావరణ దినోత్సవం

మొక్కలు నాటిన అధికారులు

వివరాలు 8వ పేజీలో..

120 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

గణపురం, జూన్ 5: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున వాహనంలో తరలిపోతున్న బియ్యాన్ని మండలంలోని చెల్పూరు వద్ద పట్టుకున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. దీన్ని చిట్యాల మండలం జూకల్లుకు చెందిన మాదాసు వంశీకృష్ణ, స్వామిదాసు మహారాష్ట్రకు తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

మందుపాతరను నిర్వీర్యం చేసిన పోలీసులు



పోలీసులు వెలికితీసిన మందుపాతర

ములుగు, జూన్ 5: ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) పోలీస్ స్టేషన్ పరిధి చెలిమెల గ్రామ సమీపంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరను పోలీసులు నిర్వీర్యం చేశారు. ఈ మేరకు ములుగు ఎస్పీ శబరీశ్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు విడుదల చేశారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో రెండురోజులుగా పోలీసులు బాంబ్‌స్క్వాడ్ బృందాలతో తనిఖీలు జరుపుతున్నారు. ఈక్రమంలో బుధవారం మధ్యాహ్నం చెలిమెల గ్రామ సమీపంలో కాలిబాట వెంట అమర్చిన మందుపాతరను గుర్తించారు. దానిని తొలగించి నిర్వీర్యం చేశారు. మావోయిస్టులు అమర్చిన మందుపాతరల వల్ల అమాయక ప్రజలు, మూగజీవాలు బలి అవుతున్నట్లు ఎస్పీ తెలిపారు. కర్రెగుట్టలపై అమర్చిన మందుపాతరలను వెంటనే వారు తొలగించాలన్నారు. కొంగాల అటవీ ప్రాంతంలో మందుపాతర పేలి ఓ వ్యక్తి మరణించిన ఘటనపై ఖండిస్తూ పౌరహక్కుల సంఘాలు స్పందించాలని ఎస్పీ కోరారు. అమాయకుల ప్రాణాలు పోవడానికి కారణమవుతున్న మావోయిస్టులకు ప్రజలు సహకరించొద్దని, వారికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని అన్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం



గాయపడిన బాలుడు శివ

చిట్యాల, జూన్ 5: బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని జడల్‌పేట శివారు భీష్మనగర్‌లో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భీష్మనగర్‌కు చెందిన పిట్టల స్వరూప, సంపత్ దంపతుల నాలుగేళ్ల కుమారుడు శివ ఇంటి బయట ఆడుకుంటుండగా వీధి కుక్కలు రెండు ఒక్కసారిగా అతడిపై దాడి చేశాయి. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రిఫర్ చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని తెలిసింది.

బ్యారేజీకి టెస్టులు

- ‘మేడిగడ్డ’ వద్ద సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు
- కుంగిన పిల్లర్లు, గేట్ల పరిశీలన
- వారం రోజులపాటు ఇక్కడే..

మహదేవపూర్ రూరల్, జూన్ 5 : మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనుల్లో భాగంగా మరో ప్రక్రియ ప్రారంభమైంది. న్యూఢిల్లీకి చెందిన సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణుల బృందం బుధవారం ఇక్కడికి చేరుకుంది. బ్యారేజీలో దెబ్బతిన్న బ్లాకు-7లో భూభౌతిక, మృత్తిక, భూసాంకేతిక పరీక్షలను ఈ టీం ప్రారంభించింది. కుంగిన పిల్లర్లతో పాటు అదే బ్లాకులోని 12,13వ పిల్లర్ల వద్ద 25ఫీట్ల మేర డ్రిల్ చేసి పరీక్షించింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచించిన విధంగా బ్యారేజీ పునరుద్ధరణకు అవసరమున్న పరీక్షలన్నింటినీ వారం రోజులపాటు చేపట్టనుంది. జియోఫిజికల్, జియో టెక్నికల్, కాంక్రీట్ పరీక్షలతో పాటు మరికొన్ని పరీక్షలను బ్యారేజీ వద్ద చేయనుంది. పరీక్షించేందుకు అనువుగా లేని నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించనున్నారు. కుంగిన పిల్లర్లతో పాటు బ్లాక్-7లోని గేట్ల ముందున్న బే ప్రాంతాల్లో డ్రిల్ చేస్తూ లోతు ఆధారంగా సేకరించిన నమూనాలను విడివిడిగా ప్యాక్ చేస్తున్నారు. కుంగిన బ్లాక్-7లోని పిల్లర్లు, గేట్లతో పాటు బ్యారేజీ ఎగువ, దిగువ ప్రవాహాల వద్ద కూడా పరీక్షలు చేయనున్నట్లు సమాచారం. మరో వారం రోజులపాటు ఈ బృందం మేడిగడ్డ వద్ద మకాం వేసి, పరీక్షల పూర్తి నివేదికను ఎన్‌డీఎస్‌ఏకు సమర్పించనున్నట్లు తెలిసింది. ఈ టీమ్‌లో ఏడుగురు సభ్యులు ఉండగా హరిదేవ్ దీనికి నేతృత్వం వహిస్తున్నారు. వీరి వెంట బ్యారేజీ ఈఈ తిరుపతిరావు ఉన్నారు.



పరీక్షల నిమిత్తం 20వ పిల్లరు వద్ద డ్రిల్ వేయిస్తున్న బృంద సభ్యులు



పిల్లర్ల నుంచి సేకరించిన కాంక్రీట్ నమూనాలు

అమాయకులను బలి తీసుకోవద్దు

మావోయిస్టులకు వ్యతిరేకంగా భారీ ప్రదర్శన



జాతీయ రహదారిపై భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజలు

వాజేడు, జూన్ 5: అమాయకులను మావోయిస్టులు బలితీసుకోవద్దని ఆయా మండలాలకు చెందిన ప్రజలు నినదించారు. పోరాటమంటే మనుషులను చంపడ మేనా..? అంటూ మావోయిస్టులకు వ్యతిరేకంగా వాజేడు మండలం జగన్నాథపురం లో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లెందుల ఏసు సోమవారం కట్టెల కోసం వెళ్లి మావోయిస్టుల మందుపాతరకు గురై మృతి చెందిన విషయం విదితమే. దీనిపై ఏజెన్సీ గ్రామాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. జగన్నాథపురంలో జాతీయ రహదారిపై వాజేడు, వెంకటా పురం (నూగూరు), ఏటూరునాగారం, మంగపేట మండలాల నుంచి సుమారు 1500 మంది ప్రజలు తరలివచ్చారు. వాజేడులోని జగన్నాథపురంలో వైజంక్షన్ నుం చి హనుమాన్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మావోయిస్టులు అమర్చిన మం దుపాతరతో ఏసు మృతి చెందడం బాధాకరమన్నారు. పోలీసులే లక్ష్యంగా అమ ర్చిన మందుపాతరలకు సామాన్యులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబ సభ్యులకు ఎవరూ సమాధానం చెబుతారని అన్నారు. అడవిలో సామాన్యులకు స్వేచ్ఛగా తిరిగే హక్కు లేదా..? అని ప్రశ్నించారు. ఏసు కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శన సందర్భంగా పోలీసులు పటిష్ఠ నిఘాను ఏర్పాటు చేశారు. సివిల్ డ్రెస్సులో ఉన్న పోలీసులు ర్యాలీని పర్యవేక్షించారు.

అభివృద్ధి పనుల నిమిత్తం ఇసుకకు అనుమతులివ్వాలి

అధికారులతో కలెక్టర్ భవేష్‌మిశ్రా

కాటారం, జూన్ 5: మండలంలో పలు అభివృద్ధి పనుల కోసం ఇసుక రవాణాకు పకడ్బందీగా అనుమతులు ఇవ్వాలని సంబంధిత అధికారులను కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. మండలంలోని విలాసాగర్ మానేరునదిని బుధవారం సందర్శించిన ఆయన ప్రతిపాదిత ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మైనింగ్, భూగర్భజల వనరులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఐదు హెక్టార్ల పరిధిని తీసుకుని నీటి సామర్థ్యాన్ని పరిశీలించి నివేదించాలని భూగర్భజల వనరుల శాఖ అధికారిని ఆదేశించారు. పన్నెండున్నర ఎకరాలకు హద్దును ఏర్పాటు చేయాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు సూచించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఇసుక రీచ్‌లు ఏర్పాటు అనుమతులు, ఈసీలను సిద్ధం చేసి త్వరితగతిన నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ అధికారి జయరాజు, భూగర్భజల వనరులశాఖ అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ నాగరాజు, ఇరిగేషన్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



మానేరు నదిని పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

మానుకోటలో కాంగ్రెస్ జోష్

● లోక్‌సభ ఎన్నికల్లో పదేళ్ల తర్వాత విజయం ● ఇక స్థానిక ఎన్నికలకు సై అంటున్న కేడర్

మహబూబాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా బీఆర్ఎస్ కంచుకోటగా ఉన్న మహబూబాబాద్ (మానుకోట) పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మళ్లా పాగా వేసింది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఉత్సాహాన్ని కొనసాగిస్తూ ఓటర్లు కాంగ్రెస్‌కు జై కొట్టారు. దీంతో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు జోష్‌లో ఉండగా.. ఇదే ఉత్సాహంతో రానున్న మునిసిపాలిటీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామపంచాయతీలు, సహకార సంఘాల ఎన్నికలకు తామంతా సై అన్నట్టుగా అధిష్టానానికి సంకేతాలిస్తున్నారు. జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మునిసిపాలిటీలు ఉండగా 18 మండలాల్లో జడ్పీటీసీలు, ఎంపీటీసీలతో పాటు 461 సర్పంచ్ స్థానాలున్నాయి. వీటిపై తిరిగి పట్టు సాధించేందుకు ఇప్పటి నుంచే గ్రామాలను శాసించే నాయకుల కోసం ముఖ్యనేతలు అన్వేషణ ప్రారంభించారు. తమతమ గ్రామాలు, పోలింగ్ బూత్‌లలో ఏ పార్టీకి ఎన్నిఓట్లు పోలయ్యాయి అనేది తెలుసుకునే దిశగా గణాంకాలు సేకరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు.

బీఆర్ఎస్‌ను కంగుతినిపించిన ఓటర్లు

పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్‌పై ఉన్న అసంతృప్తి, మార్పు కావాలన్న ఆకాంక్ష నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒక్క భద్రాచలం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో గులాబీ దండును కంగుతినిపించారు. దాని నుంచి తేరుకునే లోపే వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భద్రాచలం మినహా.. ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, పినపాకల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. ఆ తర్వాత రాజకీయ పరిణామాల్లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కూడా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పూర్తి పార్లమెంట్ నియోజకవర్గం హస్తం చేతిలోకి వెళ్లిపోయింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ఏడు సెగ్మెంట్ల పరిధిలో కాంగ్రెస్‌కు 1,09,171 ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు, బీజేపీకి కేవలం 34,431 ఓట్లు పోలయ్యాయి. ఈ లెక్కలను బేరీజు వేసుకున్న బీజేపీ వ్యూహాత్మకంగా గతంలో బీఆర్ఎస్ ఎంపీగా పనిచేసిన ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్‌కు గాలం వేసి, పార్టీలో చేర్చుకుని ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిపింది. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితనే మరోమారు రంగంలో దిగగా.. కాంగ్రెస్ పదేళ్ల క్రితం ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించి కేంద్ర మంత్రిగా పనిచేసిన పోరిక బలరాంనాయక్‌నే అభ్యర్థిగా దించింది. ఆయన గత రెండు పర్యాయాలు ఓటమి పాలైనప్పటికి మూడోసారి ఆయనకే తిరిగి అవకాశం ఇచ్చింది. ప్రస్తుత పరిణామాల్లో పార్లమెంట్ ఓటర్లు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. మానుకోట పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,32,366ఓట్లు ఉండగా 11,01,030ఓట్లు పోలయ్యాయి. అందులో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ 6,12,774ఓట్లు సాధించి 3,46,089 మెజారిటీతో విజయం సాధించారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత 2,63,609 ఓట్లతో రెండోస్థానం, బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ 1,10,444ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు. ఈ లెక్కల ప్రకారం గత పార్లమెంట్ ఎన్నికల నాటిని నేటికి కాంగ్రెస్ బలం భారీగా పెరగ్గా.. బీఆర్ఎస్ గ్రాఫ్ తీవ్రంగా పడిపోయింది. ఇక బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోగలిగింది.

జోష్‌లో హస్తం శ్రేణులు

లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో వరించిన గెలుపు ఉత్సాహంతో మున్ముందు వరుసగా జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు తహతహలాడుతున్నారు. పోలింగ్ బూత్‌లు, గ్రామాల వారీగా ఓటింగ్ సరళిని బేరీజు వేసుకుంటూ రెడీ టు ఫైట్ అంటున్నారు.

మానుకోట లోక్‌సభలో పోలైన ఓట్లు

అసెంబ్లీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
డోర్నకల్	95306	50293	9884
మహబూబాబాద్	102011	52128	17684
ఇల్లందు	92957	33658	12494
పినపాక	77430	28111	15170
భద్రాచలం	53637	19406	10294
ములుగు	86825	33592	19029
నర్సంపేట	100339	45228	24220
పోస్టల్ ఓట్లు	4269	1193	1669
మొత్తం	**6,12,774**	**2,63,609**	**1,10,444**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో..

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
డోర్నకల్	1,15,587	62,456	1,817
మహబూబాబాద్	1,16,644	66,473	17,038
ఇల్లందు	1,09,177	51,862	2566
పినపాక	90,510	56,004	2627
భద్రాచలం	47,533	53,252	1931
ములుగు	1,02,267	68,567	5388
నర్సంపేట	1,04,185	85,296	3062
మొత్తం	**6,85,897**	**4,43,910**	**34,431**

ముఖ్యమంత్రిని కలిసిన డీసీసీబీ ఛైర్మన్



హనుమకొండ సిటీ, జూన్ 5: వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. డీసీసీ బ్యాంక్ నిర్వహణ, ప్రగతి తదితర అంశాలను ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి తెలియ చేశారు.

'లోక్‌సభ' పరీక్షలో మంత్రులు ఫెయిల్!

● ఇన్‌చార్జ్‌లుగా పొరుగుజిల్లాల్లో ఓరుగల్లు నేతల బాధ్యతలు ● ముగ్గురు మంత్రుల నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికల రూపంలో వచ్చిన పరీక్షలో కాంగ్రెస్ మంత్రులు ఫెయిల్ అయ్యారన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎంతో నమ్మకంతో పొరుగు జిల్లాల్లో ఎంపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యతలు అప్పగించారు. దీంతో మంత్రులు సొంత నియోజకవర్గాలను వదిలి ఆయా లోక్‌సభ కేంద్రాల్లో విస్తృతంగా పర్యటించినా ఫలితం లేకుండా పోయింది. వరంగల్‌లో సీనియర్ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు తొలుత లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కడియం కావ్య అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో అనూహ్యంగా ఆమెను వరంగల్ బాధ్యతల నుంచి తప్పించి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి ఆ బాధ్యతలను కాంగ్రెస్ అధిష్ఠానం అప్పగించింది. ఈ క్రమంలో అప్పటికే మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న సురేఖకు మెదక్ లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఇచ్చారు. దీంతో సురేఖ లోక్‌సభ ఎన్నికల రాజకీయ వ్యూహాలపై దృష్టిపెట్టారు. అయినప్పటికీ మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఓటమిపాలయ్యారు. పైగా తన సొంత నియోజకవర్గం వరంగల్‌తూర్పులో బీజేపీకి ఆధిక్యం వచ్చింది.



అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు ఎమ్మెల్యే, మంత్రి సీతక్కకు ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆమె మూడు నెలలుగా ములుగు కంటే ఆదిలాబాద్‌లోనే ఎక్కువగా మకాం వేశారు. ఆదివాసీల ఓట్లు అధికంగా ఉండటంతో సీతక్క తన చరిష్మాతో ఆదివాసీ ఓట్లను కాంగ్రెస్‌కు మళ్లించి, పార్టీని గెలిపిస్తుందనే ఆశతో సీతక్కకు ఆదిలాబాద్ లోక్‌సభ బాధ్యతలను అప్పగించినా అక్కడ కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఓటమిపాలయ్యారు. అలాగే హనుమకొండ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వటంతో పాటు పొన్నం సూచించిన వ్యక్తికే టికెట్ పార్టీ ఇచ్చింది. అయినా కరీంనగర్‌లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో పొన్నం కూడా పార్టీ పెట్టిన తొలి పరీక్షలో ఫెయిల్ అయ్యారనే చర్చ జరుగుతోంది. ఇక భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పెద్దపల్లి లోక్‌సభ ఎన్నికల బాధ్యతలను అప్పగించగా.. ఇక్కడ మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. అయితే ఓరుగల్లు పరిధిలో ఉన్న నలుగురు మంత్రులకు కాంగ్రెస్ అధిష్ఠానం లోక్‌సభ ఎన్నికల బాధ్యతలను అప్పగిస్తే ముగ్గురు మంత్రులు ఆశించిన స్థాయిలో రాణించలేదనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

నాటికీ.. నేటికీ..

ఆరునెలల్లో మారిన ఓటరు నాడి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

గతేడాది డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి.. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల నాటికి ఓరుగల్లు ఓటరు ఆలోచనలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్ర, జాతీయ, స్థానిక రాజకీయ, సామాజిక సమీరణాలను బేరీజు వేసుకుంటున్న ఓటర్లు అనూహ్యమైన రీతిలో నిర్ణయాలు తీసుకుంటున్నారనడానికి లోక్‌సభ పోరులో పార్టీలకు ఇచ్చిన ఓటు బ్యాంకును పరిశీలిస్తే అర్థమవుతోంది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పోటాపోటీగా సాగిన పార్లమెంట్ పోరులో వరంగల్ స్థానం 'చేతి'కి చిక్కినా.. చాలా చోట్ల ఆ పార్టీ ఓటు బ్యాంకు తగ్గిపోవడం శ్రేణుల్లో కలవరం రేపుతోంది. ఇక మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీకి ఆధిక్యం రావడం.. బీజేపీ అభ్యర్థి అరూరిరమేష్ సొంత నియోజవర్గంలో కాంగ్రెస్‌కు ప్రజలు జై కొట్టడం లాంటి పరిణమాలు ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ బలం పెరగ్గా.. పట్టణ ఓటర్లు ఆ పార్టీని ఆదరించినట్టు అర్థమవుతోంది. గ్రామీణ ఓటర్లు మాత్రం కాంగ్రెస్‌వైపే నిలవగా.. వరుసగా మూడు సార్లు వరంగల్‌పై జెండా ఎగరవేసిన బీఆర్ఎస్ ఈసారి చతికిలపడింది. రెండు అసెంబ్లీ స్థానాల్లో ద్వితీయస్థానం పొంది.. ఐదు నియోజకవర్గాల్లో తీవ్రంగా దెబ్బతిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఓటర్లు 'చే'జారినా.. విజయం కాంగ్రెస్‌దే..

కాంగ్రెస్ విజయయాత్ర కొనసాగిస్తోంది. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, పది చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. స్టేషన్‌ఘనపూర్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలచిన కడియం శ్రీహరి సైతం కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం పెరిగింది. ఇదే క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పట్టు సాధించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 6,63,556 ఓట్లు పోలయ్యాయి. అయితే లోక్‌సభ ఎన్నికల్లో 5,81,294ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోల్చితే 82,262 ఓట్లు తగ్గాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నుంచి 1,06,690 ఓట్లు వస్తే ఈసారి 94,238 ఓట్లు వచ్చాయి. సుమారు 12వేల ఓట్లు తగ్గాయి. అలాగే భూపాలపల్లి నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో 1,23,116 ఓట్లు కాంగ్రెస్ వస్తే, ఎంపీ ఎన్నికల్లో 89,463 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. సుమారు 36వేలకు పైగా ఓట్లకు కోత పడింది. అలాగే పాలకుర్తిలో గతఎన్నికల్లో 1,26,848 కాంగ్రెస్‌కు పోలయితే ఈసారి కేవలం87,293 ఓట్లే పోలయ్యాయి. ఇక్కడ కూడా 38వేల ఓట్ల తగ్గాయి. మిగతా చోట్ల కూడా ఓట్లకు కోత పడింది. పరకాల, స్టేషన్‌ఘనపూర్‌లో కొంత ఓటింగ్ కాంగ్రెస్‌కు పెరిగింది. అయినప్పటికి కాంగ్రెస్ పార్టీ అంచనాలకు మించి 2.20లక్షల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విజయం సాధించారు. ఈ గెలుపుతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేడర్ జోష్‌గా పని చేసే అవకాశం లభించిందని కాంగ్రెస్ సీనియర్ నేతలు పేర్కొంటున్నారు.

వరంగల్ తూర్పులో మంత్రికి షాక్..

లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్‌తూర్పు నియోజకవర్గం చర్చనీయాంశంగా మారింది. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో బీజేపీకి మెజార్టీ ఓట్లు పోలవ్వటం హాట్ టాపిక్‌గా మారింది. తూర్పు నియోజకవర్గంలో 7,954ఓట్ల ఆధిక్యాన్ని బీజేపీ కనపర్చడం చర్చనీయాంశంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖకు 67,757ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావుకు 52,105ఓట్లు పోలయ్యాయి. 15,652 ఓట్ల మెజార్టీతో కొండా సురేఖ విజయం సాధించారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 66,627ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లకంటే 1,130ఓట్లు తగ్గాయి. అయితే బీజేపీకి గత అసెంబ్లీ ఎన్నికల్లో 52,105 ఓట్లు మాత్రమే పోలయితే, ప్రస్తుతం 74,581ఓట్లు పోలయ్యాయి. 22,476ఓట్లు అధికంగా బీజేపీ రాబట్టుకుని, వరంగల్ తూర్పులో కాంగ్రెస్‌ను రెండోస్థానానికి పరిమితం చేసింది.

అనూహ్యంగా పుంజుకున్న కమలం

వరంగల్ లోక్‌సభ పరిధిలో బీజేపీ భారీగా పుంజుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1,56,638 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అనుహ్యంగా 3,60,955ఓట్లు పోలయ్యాయి. అంటే 2,04,317 ఓట్లు అత్యధికంగా పెరిగాయి. అర్బన్ ఓటర్లు కూడా బీజేపీ వైపే మొగ్గ చూపారు. వరంగల్‌తూర్పులో కాంగ్రెస్‌ను దాటేసి ఓట్లను ఆధిక్యాన్ని సాధించింది. వరంగల్ పశ్చిమలో కూడా కాంగ్రెస్‌కు దీటుగా ఓట్లను పొందింది. పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీకి సరైన క్యాడర్ లేకపోవటంతో ఇక్కడ మూడోస్థానానికి పరిమితమైంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో కేవలం 2,982 ఓట్లే రాగా, ఈ ఎన్నికలో 28,452 ఓట్లను రాబట్టింది. భూపాలపల్లిలో కూడా అనూహ్యంగా బీజేపీ పుంజుకుంది. ఇక్కడ గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 14731 ఓట్లే పోలయితే, ఈ ఎన్నికలో 49,631 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. పరకాలలో కూడా భారీగా ఓట్లను బీజేపీ సాధించింది. పాలకుర్తి సహ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి భారీగా ఓట్లు క్రాస్ అయ్యాయి.

వర్ధన్నపేటలో అరూరికి ఝలక్..

బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు తన సొంత నియోజకవర్గ ఓటర్లు ఝలక్ ఇచ్చారు. 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన అరూరి రమేష్ 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రమేష్‌కు 87,238 ఓట్లు పోలవగా.. ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా నిలిచిన ఆయనకు కేవలం 55,427 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి.. ఇప్పటికి రమేష్‌కు 31,811ఓట్లు తగ్గటం చర్చనీయాంశంగా మారింది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 94,638ఓట్లు పోలయ్యాయి.

'కారు' పరిస్థితి మరీ దారుణం..

వరంగల్ లోక్‌సభ స్థానంలో 2014 నుంచి వరుసగా మూడు పర్యాయాలు గెలిచిన బీఆర్ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో మరింత దారుణంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కలిపి బీఆర్ఎస్‌కు 5,03,298ఓట్లు పోలవగా.. ఈ ఎంపీ ఎన్నికల్లో కేవలం 2,32,033 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే సుమారు 2,71,265ఓట్లు ఆ పార్టీకి దూరమయ్యాయనే లెక్కలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహించినా బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితం కావటం గులాబీ కేడర్‌ను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. వరంగల్ నగరంలోని వరంగల్ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు 20వేల ఓట్లు కూడా పోలవ్వలేదు. అలాగే భూపాలపల్లి, పరకాలలో గత అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా ఓట్లు పొంది రెండోస్థానంలో నిలిచిన బీఆర్ఎస్ ఈ ఎన్నికలో నామమాత్రంగా పోటీ ఇవ్వడంపై కార్యకర్తల్లో ఆందోళన కనిపిస్తోంది. అయితే పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్‌లలో మాత్రమే బీఆర్ఎస్ రెండోస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చాలా వరకు బీజేపీకి, అక్కడక్కడ కాంగ్రెస్‌కు క్రాస్ అయిందనే చర్చ జరుగుతుండగా.. మొత్తానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోక్‌సభ ఎన్నికలో వివిధ పార్టీలకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
స్టేషన్‌ఘనపూర్	98,145	40,332	43,720
పాలకుర్తి	87,293	28,452	47,878
పరకాల	76,400	44,841	36,477
వరంగల్ పశ్చిమ	63,400	60,611	19,680
వరంగల్ తూర్పు	66,627	74,581	20,360
వర్ధన్నపేట	94,238	57,427	31,345
భూపాలపల్లి	89,463	49,631	31,360
పోస్టల్	5,728	5,080	1,213
మొత్తం	5,81,294	3,60,955	2,32,033

గత అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
స్టేషన్‌ఘనపూర్	93,917	4,984	1,01,696
పాలకుర్తి	1,26,848	2,982	79,214
పరకాల	72,573	38,735	64,632
వరంగల్ పశ్చిమ	72,649	30,826	57,318
వరంగల్ తూర్పు	67,757	52,105	42,783
వర్ధన్నపేట	1,06,696	12,275	87,238
భూపాలపల్లి	1,23,116	14,731	70,417
మొత్తం	6,63,556	1,56,638	5,03,298

కాంగ్రెస్ వైపే మొగ్గు

- ములుగు సెగ్మెంట్‌లో అన్ని రౌండ్లలోనూ ఆధిక్యత
- బలరాం నాయక్‌కు 86,825 ఓట్లు
- రెండో స్థానంలో బీఆర్‌ఎస్
- 33,592 ఓట్లు సాధించిన కారు పార్టీ

ములుగు, జూన్ 5: ములుగు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతునిచ్చారు. పోస్టల్ బ్యాలెట్‌ను మినహాయిస్తే ఈవీఎంలో నిక్షిప్తమైన 1,61,883 ఓట్లలో అత్యధికంగా ఆపార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌కు అత్యధికంగా 86,825 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోతు కవితకు 33,592, బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్‌కు 19,029 ఓట్లు వచ్చాయి. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేసిన ఆదివాసీ హక్కుల నేత మైపతి అరుణ్‌కుమార్ 10,093 ఓట్లను పొందారు. నోటాకు 895ఓట్లు వచ్చాయి. 14 టేబుళ్ల, 22రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా ప్రతీ రౌండ్‌లోనూ బలరాంనాయక్ తన ఆధిక్యాన్ని చాటుకున్నారు. తొలిరౌండ్‌లో కాంగ్రెస్‌కు 4841ఓట్లు రాగా, బీజేపీకి 1070, బీఆర్‌ఎస్‌కు 1682ఓట్లు వచ్చాయి. రెండో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3730, బీజేపీకి 898, బీఆర్‌ఎస్‌కు 1734, మూడో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3679, బీజేపీకి 293, బీఆర్‌ఎస్‌కు 1679, నాల్గో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 4180, బీజేపీకి 1390, బీఆర్‌ఎస్‌కు 2424, ఐదో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3369, బీజేపీకి 646, బీఆర్‌ఎస్‌కు 947, ఆరో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3933, బీజేపీకి 1199, బీఆర్‌ఎస్‌కు 1103, ఏడో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 4144, బీజేపీకి 918, బీఆర్‌ఎస్‌కు 1151ఓట్లు వచ్చాయి. ఎనిమిదవ రౌండ్‌లో కాంగ్రెస్ కు 4599ఓట్లు రాగా, బీజేపీకి 1500, బీఆర్‌ఎస్‌కు 1821, తొమ్మిదో రౌండ్‌లో కాంగ్రెస్ 4454, బీజేపీకి 1044, బీఆర్‌ఎస్‌కు 1666, పదో రౌండ్‌లో కాంగ్రెస్‌కు 4336, బీజేపీకి 1614, బీఆర్‌ఎస్‌కు 1170, 11వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 4906, బీజేపీకి 1969, బీఆర్‌ఎస్‌కు 1908 ఓట్లు, 12వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 5109, బీజేపీకి 939, బీఆర్‌ఎస్‌కు 2024 ఓట్లు, 13వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3997, బీజేపీకి 597, బీఆర్‌ఎస్‌కు 1731ఓట్లు వచ్చాయి. 14వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3600, బీజేపీకి 655, బీఆర్‌ఎస్‌కు 1397ఓట్లు, 15వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3283, బీజేపీకి 1053, బీఆర్‌ఎస్‌కు 1338ఓట్లు, 16వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3711, బీజేపీకి 845, బీఆర్‌ఎస్‌కు 1290ఓట్లు, 17వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3,822, బీజేపీకి 620, బీఆర్‌ఎస్‌కు 1,663ఓట్లు, 18వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3810, బీజేపీకి 499, బీఆర్‌ఎస్‌కు 1,473ఓట్లు వచ్చాయి. 19వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3,744, బీజేపీకి 258, బీఆర్‌ఎస్‌కు 1013ఓట్లు, 20వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3,669, బీజేపీకి 599, బీఆర్‌ఎస్‌కు 1,583 ఓట్లు, 21వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 2763, బీజేపీకి 243, బీఆర్‌ఎస్‌కు 1,524 ఓట్లు, చివరిదైన 22వ రౌండ్‌లో కాంగ్రెస్‌కు 3,146 ఓట్లు రాగా, బీజేపీకి 180, బీఆర్‌ఎస్‌కు 1271 ఓట్లు వచ్చాయి.

మసకబారిన బీఆర్‌ఎస్

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రాభవం తగ్గినట్లు వరుస ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం చెందిన పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో తక్కువ ఓట్లు సాధించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సీతక్క విజయం సాధించినప్పటికీ ఆతర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 33వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యాన్ని పొందింది. ఈసారి కూడా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా పార్లమెంటుకు సర్దుకుం టుందని భావించిన నేతల అంచనాలు తలకిందుల య్యాయి. ఓటమితో నెలకొన్న నైరాశ్యానికి తోడు నేతల మధ్య సమన్వయ లోపం, కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌పై ఉన్న సానుభూతి.. వెరిసి బీఆర్‌ఎస్‌కు చేదు అనుభవం ఎదురైంది.

కాంగ్రెస్‌లో జోష్

కాంగ్రెస్ శ్రేణుల్లో విజయం తాలూకు జోష్ కనిపిస్తోంది. ఆపార్టీ అభ్యర్థి బలరాం నాయక్‌ది ములుగు నియోజకవర్గమే కావడం, 2014 నుంచి అన్ని ఎన్నికల్లో ఓటమిచెందుతుండటంతో సాధారణంగానే ఆయనపై సానుభూతి వ్యక్తమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో సీతక్క గెలవడమే కాక రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం, సీతక్క మంత్రి కావడం, జాతీయ స్థాయిలో ఇండియా కూటమికి సానుకూలత కనిపించడంతో సొంత ఓటు బ్యాంకుతో పాటు బీఆర్‌ఎస్, తటస్థుల ఓట్లు కాంగ్రెస్‌కు పడ్డాయి. దీంతో 2009పార్లమెంటు ఎన్నికల తర్వాత ఇన్నేళ్లకు హస్తం పార్టీకి ములుగు నియోజకవర్గంలో మంచి మెజారిటీ వచ్చింది.

బీజేపీకి పెరిగిన ఓట్లు

నియోజకవర్గంలో బీజేపీకి పెద్దగా ప్రభావం లేదు. ప్రతి అ సెంబ్లీ ఎన్నికలోనూ డిపాజిట్ గల్లంతవుతోంది. 2వేల ఓట్లు దాటి న దాఖలాలు లేవు. లోక్‌సభ ఎన్నికల్లో అత్తెసరు ఓట్లే వస్తు న్నాయి. ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం పార్టీ 5,3 88 ఓట్లు సాధించింది. అదే పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల సంఖ్య 19,029కు పెరిగింది. అయోధ్య రామమందిర ప్రభావంతో ఎక్కువ మంది మహిళలు కమలం గుర్తుపై ఓటేయగా యువత కూడా బీజేపీ వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది.

ఆదివాసీ ఓట్లను చీల్చిన ఏఐఎఫ్‌బీ

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మైపతి అరుణ్‌కుమార్ 10,093 ఓట్లతో ప్రభావం చూపారు. తుడుందెబ్బ విద్యార్థి సంఘం నాయకుడిగా ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమిస్తున్న అరుణ్ ఆదివాసీ సామాజికవర్గానికి చెందిన ఓటర్లను ప్రభావితం చేయగలిగారు. భారీ సభలు, రోడ్ షోల జోలికి పోకున్నప్పటికీ గూడాలలో విస్తృతంగా పర్యటించి సమావేశాలు నిర్వహించారు. ఆదివాసీ యువత, ఉద్యోగులు, ప్రజలను కలిశారు. అత్యధిక ఓటు శాతం ఉన్నప్పటికీ తమను విస్మరించిన ప్రధాన రాజకీయ పార్టీలు లంబాడీలకు టిక్కెట్‌ను ఇవ్వడాన్ని ప్రముఖంగా వివరించారు. మన ఓట్లు మనకే.. నినాదాన్ని బలంగా వినిపించి నియోజకవర్గంలో నాల్గో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ముగ్గురూ లంబాడీలే కాగా.. ఆయనకు వచ్చిన ఓట్లన్నీ ఆదివాసీలవేనని స్పష్టమవుతోంది. బీజేపీ అభ్యర్థితో పోటీప డుతూ పలు రౌండ్లలో అత్యధిక ఓట్లను సాధించా రాయన. 18వ రౌండ్‌లో 1055 ఓట్లు, 19వ రౌండ్‌లో 885 ఓట్లు, 20వ రౌండ్‌లో 405 ఓట్లు, 21వ రౌండ్‌లో 523ఓట్లు, 22వ రౌండ్‌లో 598 ఓట్లు పొందారు.

బ్రహ్మరథం పట్టిన భూపాలపల్లి

కావ్యకు అధిక మెజారిటీ ఇచ్చిన సెగ్మెంటు • ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యమే..

అసెంబ్లీ తరహాలోనే కాంగ్రెస్‌కు ఆదరణ

భూపాలపల్లిటౌన్, జూన్ 5: కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు భూపాలపల్లి సెగ్మెంటు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌కూ ఆమె ఇక్కడి నుంచి ఆధికత్యతను చాటుకు న్నారు. మొత్తం 18 రౌండ్లలో కౌంటింగ్ జరగ్గా అన్నింట్లోనూ మెజారిటీ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో గండ్ర సత్యనారాయణకు ప్రతి రౌండ్‌కూ ఆధిక్యత వచ్చినట్టే కావ్య కూడా అదే విధంగా సత్తాను చాటుకోవ డంతో కాంగ్రెష్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. అయితే.. భూపాలపల్లి సెగ్మెంటు నుంచి 70 వేల నుంచి లక్ష మెజారిటీ ఇస్తున్నామని కాంగ్రెస్ నేతలు ప్రకటించుకోగా 39 వేలతో మాత్రమే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

మెజారిటీ ఇలా..

మొదటి రౌండ్‌లో భూపాలపల్లి సెగ్మెం టు నుంచి బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు 2,412 ఓట్లురాగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు 4,981 ఓట్లు వచ్చాయి. కావ్య 2,569 ఓట్ల ఆధిక్యత సాధించారు. రెండో రౌండ్‌లో అరూరికి 2,601 రాగా కావ్యకు 3,866 వచ్చాయి. ఆమెకు 1,265 ఓట్ల ఆధిక్యత వచ్చింది. మూడో రౌండ్‌లో అరూరికి 2,664 రాగా కావ్యకు 4734 వచ్చాయి. 2,070 మెజారిటీ దక్కింది. నాలుగో రౌండ్‌లో 2,733, ఐదో రౌండ్‌లో 2,959. ఆరో రౌండ్‌లో 1828 ఆధిక్యత వచ్చింది. ఇలా 18వ రౌండ్ వరకు ఆధిక్యతే కనిపించింది.

ఎవరికి ఎన్ని?

భూపాలపల్లి సెగ్మెంటులో 1,87,395 ఓట్లు పోలవగా బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు 49,631, కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు 89,463, బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు 31,360 ఓట్లు వచ్చాయి. ఇందులో అరూరిపై కడియం కావ్య 39,832 మెజారిటీ సాధించారు. చివరి రౌండ్ 18లో ఈ ఫలితాలను అధికారులు వెల్లడించారు. అయితే బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ స్థానంలో ఉన్నారు.

నోటాకు 963 ఓట్లు

పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థులపై పలువురు ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓటు వేసేందుకు ఎవరూ నచ్చకపోవడంతో నోటా బటన్‌ను నొక్కారు. భూపాలపల్లి సెగ్మెంటులో నోటాకు 963 ఓట్లు పోలయ్యాయి.

నేటి నుంచి బడిబాట

ములుగు కలెక్టరేట్, జూన్ 5: వేసవి సెలవులు ముగుస్తున్నాయి. బడిగంట మోగే సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పిల్లలను బడిబాట పట్టించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం, ఎక్కువ మంది బాలలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించుకోవడం కోసం ప్రణాలిక సిద్ధమైంది. ఈనెల 6 నుంచి 19 వరకు రెండు విడతలుగా ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగనుంది. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి సర్కారు బడులు, సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. గ్రామాలలో ర్యాలీలు నిర్వహించి చదువు విలువను తెలియజేస్తారు.

గతేడాది సత్ఫలితాలు

జిల్లాలో 510 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. బడిబాట కార్యక్రమం 2023-24 విద్యా సంవత్సరంలో సత్ఫలితాలనిచ్చింది. సుమారు 3వేల కొత్త అడ్మిషన్‌లు నమోదయ్యాయి. తొమ్మిది మండలాల్లో కలిపి 2939 కొత్త విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ప్రీ ప్రైమరీ స్థాయిలో 141మంది, 1వ తరగతిలో అంగన్‌వాడీల నుంచి 1449మంది, ప్రైవేటు నుంచి 131 మంది, నేరుగా 266మంది, 2వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు 1093మంది ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఈసారి కూడా అదే స్థాయిలో కొత్త అడ్మిషన్లు నమోదయ్యేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

షెడ్యూలు ఇలా..

- 6వ తేదీ తొలిరోజున గ్రామస్థాయిలో సమావేశం నిర్వహించి బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా ప్రతిజ్ఞ చేయించాలి. అన్ని స్వయం సహాయక సంఘాల సభ్యులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులను భాగస్వాములను చేయాలి.
- 4వ తేదీన ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలకు అడ్మిషన్ ఇవ్వడం. జాబితా తయారుచేసి గ్రామ విద్యార్థి రిజిష్టర్‌ను నవీకరించాలి.
- 5వ తేదీన గ్రామంలో బడిబాటపై ప్రచారం చేస్తూ అంగన్‌వాడీలను సందర్శించాలి. పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. ప్రత్యేక విద్యాభ్యాసం అవసరమైన పిల్లలను గుర్తించి ప్రత్యేక వసతులు కలిగిన పాఠశాలల్లో చేర్పించే విధంగా ప్రోత్సహించాలి.
- 11వ తేదీన బడిబాట ప్రగతిపై చర్చించాలి. అడ్మిషన్ తీసుకున్న పిల్లలంతా బడికి వచ్చేలా చొరవ తీసుకోవాలి.
- 12వ తేదీన నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో స్వాగత దినాన్ని నిర్వహిస్తారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను ప్రారంభించాలి. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారాలను పంపిణీ చేస్తారు.
- 13న పఠనం, అంక గణితం, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్‌లో భాగంగా క్విజ్ పోటీలు, ప్రాథమిక గణిత చర్యల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాలి.
- 14న సామూహిక అక్షరాభ్యాసం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు.
- 15న బాలికా విద్యాదినం, 18న డిజిటలైజేషన్‌పై అవగాహన కల్పించిన అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం, 9న క్రీడా దినోత్సవం నిర్వహించడం ద్వారా బడిబాట పూర్తవుతుంది.

నాణ్యమైన విద్యను అందిస్తాం : పాణిని, డీఈవో

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించడంతోపాటు మెరుగుపర్చిన సౌకర్యాలు కల్పిస్తాం. పాఠశాలల పునఃప్రారంభం రోజునే ఎక్కువ మంది విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫారం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

నీట్ ఫలితాల్లో శివాని విద్యార్థుల విశ్వరూపం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 5: నీట్-2024 ఫలితాల్లో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి తెలిపారు. సీహెచ్ సాత్విక 720 మార్కులకు 611, ఎస్.సాయిప్రియ 535, వి.భవాని 529, ఎన్.ప్రదీప్ 487, ఇ.కార్తీక్ 483, సీహెచ్.సాద్విక 481, ఎల్.అనూష 481, బి.లోకేష్ 477, ఎం.ముఖేష్ 477, ఎన్.వర్షిత 448, కె.శివసాయి 443, ఎ.మనోజ్ 430, డి.కీర్తన 416 మార్కులు సాధించినట్లు వివరించారు. కొన్నేళ్లుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ శివాని కళాశాల పేరుప్రఖ్యాతలు నిలబెడుతున్నట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ టి.స్వామితోపాటు ప్రిన్సిపాల్స్ జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, టి.రాజు, ఎన్.రమేశ్, ఎ.మురళి, వి.సురేశ్, ఎస్.సంతోష్‌రెడ్డి అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పార్టీల గెలుపుపై సంబరాలు

కాటారం, జూన్ 5: మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, అభిమానులు, పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ బుధవారం వేర్వేరుగా సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి కేకులు కట్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రతిపక్షం అనేదే లేకుండా ప్రభంజనం సృష్టించడంపై ఆనందం వ్యక్తం చేస్తూ సంబరాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, భాస్కరచారి, టీడీపీ, పవన్‌కల్యాణ్ అభిమానులు ఏసు, వెంకటేష్, రాజేష్, శశికుమార్, రజనీకాంత్, రాజేష్, రాజ శేఖర్, దేవేంద్రచారి, అవినాష్, హరికృష్ణ పాల్గొన్నారు.

- మంగపేట : మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్‌లో బుధవారం సాయంత్రం పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ సంబరాలు జరుపుకున్నారు. పవన్ కల్యాణ్ అసోసియేషన్ ఫ్యాన్స్ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేష్, మద్దెల లక్ష్మణ్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ ప్రవీణ్, కోశాధికారి సునారికాని చిరంజీవి, నాయకులు పల్లాపు రమేష్, సురేష్, శ్రీశైలం, అర్జున్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండలంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలిని నిర్వహించారు. కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ ప్రధానగేట్ నుంచి బ్రాహ్మణపల్లి వరకు ద్విచక్ర వాహనాల ప్రదర్శన జరిగింది.

బీజేపీ జిల్లా కార్యదర్శి పొదెం రవీందర్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. యాకూబ్‌పాషా, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు లోడే శ్రీనివాస్‌గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు ఎర్రంకరి వీరన్‌కుమార్, మండల కార్యదర్శులు నిడుదవోలు శ్రీనివాస్, బొల్లికొండ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గొత్తికోయ చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, జూన్ 5: గొత్తికోయ చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సహకరించాలని టాటా ట్రస్టు స్వచ్ఛంద సంస్థను కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. తన ఛాంబర్‌లో ట్రస్టు ప్రతినిధులు, వ్యవసాయ, జిల్లా సంక్షేమాధికారుతో ఆమె బుధవారం సమావేశమయ్యారు. గొత్తికోయ గూడేల్లోని మహిళలు, చిన్నారులు ఎక్కువగా రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని, పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఆరోగ్య పరీక్షలు, సేవలు అందించేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వ్యవసాయ రంగానికి సోలార్ విద్యుత్ వినియోగించడంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనీన, జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌చంద్ర, టాటా ట్రస్టు రీజనల్ మేనేజర్ భగీరథ గోప్, ఏరియా మేనేజర్ వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రికి పటిష్ఠ భద్రత

లోక్‌సభ ఎన్నికల 45 రోజుల పిటిషన్ ముగిసేంత వరకు ఎన్నికల సామగ్రికి పటిష్ఠ భద్రత కల్పించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మహబూబాబాద్‌లో ఓట్ల లెక్కింపు తర్వాత ఎన్నికల సామగ్రిని మంగళవారం రాత్రి ములుగుకు తరలించి కలెక్టరేట్‌లోని గోడౌన్‌లో భద్రపరిచారు. కలెక్టర్ వెంట ఏవో రాజ్‌కుమార్, ఎన్నికల అధికారులు ఉన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

కాకతీయఖని, జూన్ 5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని భూపాలపల్లి అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిం చారు. జిల్లా అటవీశాఖ కార్యలయం నుంచి అర్బన్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రకృతి భవ న్‌లో, జయశంకర్ ఎకో(అర్బన్) పార్క్‌లో కాళేశ్వరం సర్కిల్ సీసీఎఫ్ ప్రభాకర్, జిల్లా అటవీశాఖ అధికారి వసంత సుమారు 300 మొక్కలను నాటారు. రేంజ్ అధికారి ఆసిఫ్‌అలీ, డీఆర్‌వో ఝాన్సీ, బీట్ ఆఫీసర్ ప్రశాంత్ యాదవ్ పాల్గొన్నారు.

- సింగరేణి ఆధ్వర్యంలో ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్ గనులు, డిపార్ట్‌మెంట్ ఆవరణలో మొక్కలు నాటారు. అధికా రులు కవీంద్ర, జ్యోతి, జీఎల్.ప్రసాద్, రవికుమార్, సురేఖ, తుకారాం, గుండు రాజు, క్రాంతికుమార్, శ్యామ్‌ప్రసాద్, పోషమల్లు తదితరులు పాల్గొన్నారు.
- ములుగు కలెక్టరేట్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జిల్లా కోర్టులో నిర్వహించారు. కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎస్.వి.పీ.సూర్యచంద్రకళ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.కన్నయ్యలాల్, జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి డి.రామ్మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వినయ్‌కుమార్ యాదవ్, న్యాయవాదులు సునీల్ కుమార్, మహేందర్, రాంసింగ్, భిక్షపతి, సుస్మిత, స్వామిదాసు, రాజ్‌కుమార్, అర్చన, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.
- గణపురం : మండలంలోని మైలారం గ్రామ పంచాయతీలో డీఆర్‌డీవో పీడీ నరేష్ మొక్కలను నాటారు. అదనపు డీఆర్‌డీవో వసుమతి, ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.
- మల్హర్ : మండలంలోని పెద్దతూండ్లలో అమృత సరోవర్ ట్యాంకు వద్ద ఉపాధి కూలీలతో కలిసి ఎంపీడీవో శ్యామ్ సుందర్ మొక్కలు నాటారు. ఏపీవో గిరి హరీశ్, పంచాయతీ కార్యదర్శి సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ సంతోష్ పాల్గొన్నారు.
- మహదేవపూర్ : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మహదేవపూర్ మండలం అమృత్‌సర్ చెరువు కట్ట వద్ద ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో రమేష్ దినసరి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమ్మయ్య, జేఈ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రవళిక పాల్గొన్నారు.
- కాటారం: మండల కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మహదేవ పూర్ డివిజన్ పరిధిలోని వివిధ రేంజ్‌లకు చెందిన అటవీ అధికారులు, సిబ్బంది కాటారం నుంచి మహదేవపూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రేంజ్ కార్యాలయాల ఆవరణలో అటవీ అధికారులు మొక్కలు నాటారు. కాటారం డిప్యూటీ రేంజర్ సురేందర్, ఎఫ్‌ఎస్‌వోలు చంద్రశేఖర్, అర్చన, సుమన్, ఎఫ్‌బీవోలు అశోక్, రాజ్‌కుమార్, జయలక్ష్మి, అఖిల్, శ్రీకాంత్,

విద్యుదాఘాతంతో ఐదు పశువుల మృతి


పశువుల కళేబరాల వద్ద బాధిత రైతులు, గ్రామస్థులు

మహదేవపూర్ రూరల్, జూన్ 5: విద్యుదాఘాతంతో ఒకేసారి ఐదు పశువులు మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దంపే టలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ వారం సాయంత్రం గాలివానకు సబ్‌స్టేషన్ సమీపంలో వైర్లు నేలవాలాయి. ఈక్రమంలో మేత కోసం అటుగా వెళ్లిన తడండ్ల లక్ష్మయ్యకు చెందిన రెండు ఎద్దులు, గౌరివేని కిష్టయ్యకు చెందిన ఒక ఎద్దుతో పాటు గావిడి మల్లయ్య, తడండ్ల ఎర్రయ్యకు చెందిన రెండు పాడి గేదెలు ఈ తీగలను తాకి కరెంటు షాక్‌తో అక్క డికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని తెలి పారు. గాలి వానకు విద్యుత్ వైర్లు నేలవాలా యని, సరఫరాను నిలిపివేసి పునరు ద్ధరిం చాలని సంబంధిత శాఖ అధికారులకు సమా చారం ఇచ్చినా పట్టించుకోలేదని, దీంతో మూగజీవాలు మృత్యువాత పడ్డాయని గ్రామ స్థులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకొని బాధితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

మాన్‌సింగ్‌తండాలో రెండు దుక్కిటెడ్లు

ములుగు: మండల పరిధిలోని మాన్‌సింగ్ తండాలో విద్యుదాఘాతంతో బుధవారం రెండు దుక్కిటెడ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన విప్‌సింగ్, అంగోతు యాకూబ్‌కు చెందిన ఎడ్లుమేతకోసం సమీపంలోని పొలాల్లోకి వెళ్లాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లగా షాక్‌కు గురై మృతిచెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ లేకపోవ డంతోనే ప్రమాదం జరిగినట్లు గ్రామస్థులు తెలి పారు. మరణించిన ఎద్దుల విలువ సుమారు రూ.లక్షా 50వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

టీకాతో చిన్నారులకు ఆరోగ్యరక్ష : డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్, జూన్ 5: ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను టీకాతో రక్షించొచ్చని డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య అన్నారు. ములుగు మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జంగాలపల్లి, కొత్తూరు, సర్వాపూర్ సెంటర్లను అయన బుధవారం తనిఖీ చేశారు. మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను డీఎంహెచ్‌వో పంపిణీ చేశారు. చిన్నారులకిచ్చే టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యా. ధికారి శ్రవణ్‌కుమార్, స్టాఫ్‌నర్సు మున్ని, ఏఎన్‌ఎంలు సులోచన, సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షకు తొమ్మిది మంది గైర్హాజరు

కాకతీయఖని, జూన్ 5: పదో తరగతి హిందీ పరీక్షకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హారయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సప్లమెంటరీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 17 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా ఎనిమిది మంది హాజరయ్యారని తెలిపారు.

విత్తన షాపుల్లో ఏవో తనిఖీలు

కాటారం, జూన్ 5: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్స్, విత్తనాల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి గిరి రామకృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పత్తి, వరి విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. నిషేధిత పత్తి విత్తనాలను విక్రయించినా, కొన్ని రకాల పత్తి విత్తనాలను కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో అధిక ధరలకు అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

మహదేవపూర్, జూన్ 5 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల శాఖ సమావేశం బుధవారం మహదేవపూర్ మండల కేంద్రంలో స్థానిక రామాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం మహదేవపూర్ అధ్యక్షుడిగా అడప రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీ ఠాకూర్‌విక్రం సింగ్, కోశాధికారిగా ఆనందుల అంకన్న, గౌరవ అధ్యక్షుడిగా సిరిపురం రాజేశ్వర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా వెలగల సత్యనారాయణరెడ్డిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలుగా తన్నీరు అంకమ్మ, గొట్టెముక్కుల లక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా బికినూరి లక్ష్మనరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గంధసిరి రామన్న, ఎర్రవెల్లి శకుంతలమ్మ, ఖుర్షీద్ అహ్మద్, పబ్లిసిటీ కార్యదర్శిగా మేరుగు వెంకటి ఎన్నికయ్యారు.

నడిరోడ్డుపై లారీ బోల్తా

కాటారం, జూన్ 5: మండలంలోని ఏఎంసీ యార్డు సమీపంలో కాటారం-మంథని ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి లారీ అదుపుతప్పి నడిరోడ్డుపై బోల్తాపడింది. వాహనదారుల వివరాల ప్రకారం.. కొన్ని రోజులుగా రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఓ వైపు తారును తీసి మొరం పోసి పనులు చేస్తున్నారు. భూపాలపల్లి నుంచి మంథని వైపు వెళ్తున్న లారీ మట్టిరోడ్డుపై నుంచి వేగంగా దిగే క్రమంలో అదుపుతప్పి రోడ్డుపైనే బోల్తాపడింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. దీంతో రెండువైపులా వందలాది వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అయింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు లారీని పక్కకు తొలగింపజేశారు.